క్లుప్తంగా

మైనార్టీ రుణాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

వేములవాడ: మైనార్టీ సబ్సిడీ రుణాలకు వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అన్వేశ్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో 308 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారని, వీరిలో 193 మంది ఇంటర్వ్యూకు హాజరయినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, బ్యాంకు అధికారులు మాధవరావు, నవీన్, సంతోష్, కిషన్ పాల్గొన్నారు.

లూజ్ వైర్లను సరిచేస్తాం



లూజ్ వైర్లను పరిశీలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: ఇళ్లపై నుంచి వెళ్తున్న ప్రమాదకరమైన లూజ్ విద్యుత్ తీగలను మరమ్మతు చేస్తామని సెస్ ఏఈ దివ్య, డైరెక్టర్ వరుస కృష్ణహరి అన్నారు. మండల కేంద్రంలోని 11 కేవీ రూరల్ ఫీడర్ లైన్‌ను మంగళవారం పరిశీలించి, దీన్ని అప్‌గ్రేడ్ చేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఇళ్లకు తాకుతూ లూజుగా ఉన్న విద్యుత్ తీగలతో గతంలో ప్రమాదాలు జరిగి కాడెద్దులు, గేదెలు మరణించగా, రైతుల ఫిర్యాదు మేరకు లూజువైర్లను పరిశీలించినట్లు తెలిపారు. వెంటనే వాటిని తొలగించి కొత్తగా విద్యుత్ స్తంభాలు వేసి మరమ్మతు పనులు చేపడతామని అన్నారు. మండల కేంద్రంలోని అనేక కాలనీల్లో ఈ సమస్య ఉందని త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, లైన్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



తనిఖీ చేస్తున్న వైస్‌ఎంపీపీ

చందుర్తి: రుద్రంగి మండలం మానాల పీహెచ్‌సీని వైస్‌ఎంపీపీ సీపరి భూమయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బంది హాజరు రిజిష్టర్‌ను, వైద్య సేవలకు వచ్చి వెళ్లే పేషెంట్స్ రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ చేయించేందుకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. అడ్డబోరు తండా సర్పంచ్ మోహన్, సింగిల్‌విండో అధ్యక్షుడు ఏలేటి చిన్నారెడ్డి, వీడీసీ చైర్మన్ గోపిడి రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తించారు.. వదిలేశారు

- రహదారుల వెంట పాతబావులు
- ప్రమాదం అంచున ప్రయాణం
- రోడ్ల వెంట 21 బావులు
- ఆరు నెలల్లో 15 మందికి గాయాలు
- పట్టించుకోని అధికారులు

ఎల్లారెడ్డిపేట: రహదారుల వెంట ప్రమాదకరంగా ఉన్న పాత బావులను పూడ్చివేయాలనే ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. ఉపాధిహామీ పథకంలో ప్రమాదకరంగా ఉన్న బావులను పూడ్చివేయాలని అధికారులు రోడ్ల వెంట ఉన్న వాటిని గుర్తించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని వివిధ రహదారుల వెంట ఉన్న 21 ప్రమాదకర బావులను పూడ్చివేయడానికి మండల సర్వసభ్య సమావేశాల్లో తీర్మానించారు. 21 పాత బావుల్లో కేవలం ఐదు బావులను పూడ్చివేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. 21 బావులను గుర్తించి వాటిని పూడ్చివేయకుండా లక్షణంగా వదిలేశారనే ఆరోపణలున్నాయి. ప్రమాదకరంగా రోడ్లను ఆనుకోని ఉన్న బావుల వద్ద అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. ఫలితంగా రాత్రి వేళ ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.



ఎల్లారెడ్డిపేట శివారులో ప్రమాదకరంగా ఉన్న పాతబావి

కొత్త వ్యక్తులు రోడ్ల వెంట ఉన్న బావుల సంగతి తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. బావుల పూడ్చివేతను ఉపాధి హామీ పథకంలో చేయాలనే నిబంధనలను ఎత్తివేసినట్లు అధికారులు చెపుతున్నారు. గతంలో కొన్ని బావులను అదే పథకంలో పూడ్చివేయగా, ఈ కొత్త నిబంధనలపై అధికారులకు స్పష్టత లేదు. దీంతో బావుల పూడ్చివేతలో అంతులేని జాప్యం జరుగుతోంది. అధికారుల నిబంధనలు ఎలాఉన్న ప్రజలకు మాత్రం బావులతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ప్రమాదకర బావులను పూడ్చివేయాలని మంత్రి కేటీఆర్ ఆదేశించినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు.

ఈ దారుల్లోనే ప్రమాదకర బావులు

ఎల్లారెడ్డిపేట నుంచి వీర్నపల్లి వెళ్లే రహదారిలో మూడుచోట్ల ప్రమాదకర పాత బావులున్నాయి. ఎల్లారెడ్డిపేట శివారులో రెండు, అల్మాస్‌పూర్ వద్ద ఒకటి, రాచర్లగుండారం రహదారిలో నాలుగు చోట్ల, బండలింగంపల్లి వెళ్లే దారిలో నాలుగు బావులు దగ్గరగా, రాజన్నపేట వద్ద, పోతిరెడ్డిపల్లి రహదారిలో మూడు చోట్ల, అగ్రహారం శివారులో, కోరుట్లపేట వెళ్లే దారిలో, సింగారం శివారులో బావులు నోరు తెరుచుకొని ప్రమాదకరంగా ఉన్నాయి. సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారి వెంట ఐదు బావులు దగ్గరగా రోడ్డును ఆనుకోని ఉన్నాయి.ఈ పాత బావులను గుర్తించినప్పటికీ పూడివేయడంలో జరుగుతున్న జాప్యంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఆరు నెలల కాలంలో వివిధ రహదారుల్లో గల పాత బావుల వద్ద ప్రమాదాలు జరిగి సుమారు 15 మందికి గయాలయ్యాయి.

మంత్రి కేటీఆర్ స్పందించాలి

ప్రమాదకరంగా ఉన్న బావులను తక్షణమే పూడ్చివేసి ప్రజలకు రక్షణ కల్పించే విధంగా మంత్రి కేటీఆర్ ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఉపాధిహామీ పథకంలో బావులను పూడ్చివేసే పరిస్థితి లేకపోవడంతో ప్రత్యేక నిధులు మంజూరు చేస్తే కాని సమస్య పరిష్కారం అయ్యేలా లేదు. మంత్రి ప్రత్యేక దృష్టిసారించి రోడ్ల వెంట అతి ప్రమాదకరంగా ఉన్న బావులను పూడ్చివేసే విధంగా అధికారులను ఆదేశించాలని ప్రజలు కోరుతున్నారు.

బావులను పూడ్చివేయాలి



రహదారుల వెంట ప్రమాదకరంగా ఉన్న బావులను వెంటనే పూడ్చి వేయాలి. బావుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. రాత్రివేళ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే స్పందించి బావులను పూడ్చివేసి రక్షణ కల్పించాలి.

– గోరిటికార్ జితేందర్, బండలింగంపల్లి

ప్రతిపాదనలు పంపాం



రహదారుల వెంట ఉన్న బావులను పూడ్చివేయడానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం. అతి ప్రమాద కరంగా ఉన్న కొన్ని బావులను గతంలో ఉపాధిహామీ పథకంలో పూడ్చివేశాం. నిధులు మంజూరు కాగానే అన్ని దారుల్లో ఉన్న బావులను ప్రాధాన్యత క్రమంలో పూడ్చి వేస్తాం. పాతబావులు, ఇళ్లను కొన్ని గ్రామాల్లో పంచాయతీలే పూడ్చివేసుకుంటున్నారు.

– చిరంజీవి, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

మండల సమావేశం బహిష్కరణ

- పెండింగ్ బిల్లులు చెల్లించలేదని సభ్యుల నిరసన



మాట్లాడుతున్న సర్పంచ్ పాటి దినకర్

వీర్నపల్లి: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఎంపీపీ మాలోత్ భూల అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని సభ్యులు బహిష్కరించారు. అనంతరం సర్పంచ్ పాటి దినకర్ మాట్లాడుతూ పల్లె ప్రగతిలో భాగంగా గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ అధికారులు చేసిన పనులకు సకాలంలో రికార్డు చేయడం లేదని ఆరోపించారు. అలాగే అధికారులు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అన్ని శాఖల అధికారులు హాజరైతే ప్రజల సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం ఉండేది అన్నారు. ఎన్నిసార్లు చెప్పిన ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అందుకే సమావేశాన్ని బహిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నరేశ్‌కుమార్, జెడ్పీటీసీ కళావతి, సెస్ డైరెక్టర్ మల్లేశం, జిల్లా కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా పాల్గొన్నారు.

మల్లన్నసాగర్ కెనాల్ పనులు పూర్తి చేయాలి

- కాలువ పనులను పరిశీలించిన ప్రజాప్రతినిధులు
- సహకరించాలని కోరిన అధికారులు



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

ముస్తాబాద్: మండలంలోని బందనకల్, వెంకట్రావుపల్లె గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న మల్లన్నసాగర్ కెనాల్ పనులను త్వరగా పూర్తిచేయాలని మండల ప్రజాప్రతినిధులు కోరారు. బందనకల్, వెంకట్రావుపల్లెలో 12వ ప్యాకేజీ కింద నిర్మిస్తున్న కెనాల్ పనులను ప్రజాప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. రైతులు తమ పంట పొలాలను కెనాల్ నిర్మాణం కోసం అందించడం గొప్ప విషయమన్నారు. రాబోవు వానకాలం పంటల వరకు కెనాల్ పనులను పూర్తిచేయాలని కోరారు. డీఈఈ హరీశ్ మాట్లాడుతూ భూసేకరణలో జాప్యం జరిగిందని, రైతులు సహకరిస్తే పనులను త్వరతగతిన పూర్తి చేస్తామన్నారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎస్ఎస్ రెడ్డి, సురేందర్‌రావు, చిగురు నరేశ్ రైతులు పాల్గొన్నారు.

మూడో రోజుకు వీవోఏల సమ్మె



సమ్మె చేస్తున్న వీవోఏలు

ఇల్లంతకుంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం వీవోఏలు సమ్మె చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.18 వేలకు పెంచాలని, వీవోఏలతో ఆన్‌లైన్ పనులు చేయించొద్దన్నారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రభుత్వం స్పందించేంత వరకు సమ్మె చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అనురాధ, అన్నపూర్ణ, పద్మలత, బాలలక్ష్మి, రేణుక పాల్గొన్నారు.



ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

సమ్మెకు ఎంపీపీ మద్దతు

వేములవాడరూరల్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని మూడు రోజులుగా సమ్మె చేస్తున్న ఐకేపీ వీవోఏలకు వేములవాడ రూరల్ ఎంపీపీ బండ మల్లేశంయాదవ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు తమకు న్యాయం చేయాలని మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లిన వారు ఎంపీపీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ తరుపున మద్దతు ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. లక్ష్మి, రాజేశ్వరి, సుమలత, రమ్య తదితరులు ఉన్నారు.

సమ్మెకు జైకొట్టిన జేపీఎస్, ఓపీఎస్‌లు



సిరిసిల్లలో కలెక్టరేట్ ఎదుట బతుకమ్మలతో జేపీఎస్, ఓపీఎస్‌ల నిరసన

తంగళ్లపల్లి: తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ 12 రోజులుగా శాంతియుత నిరవధిక సమ్మె చేస్తున్న జేపీఎస్, ఓపీఎస్‌లు సమ్మెకే జై కొట్టారు. విధుల్లో తిరిగి చేరేందుకు విముత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.తమను రెగ్యులర్ చేసేంత వరకు విధుల్లో చేరేది లేదని తేల్చిచెబుతున్నారు.

సిరిసిల్లఅర్బన్: సమ్మెకు బీఎస్పీ పట్టణాధ్యక్షుడు అన్నల్‌దాస్ భాను సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం జెపీఎస్‌ల సమస్యలను పరిష్కరించి, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు వేణుగోపాల్, దేవరాజు, రాకేష్, రవి పాల్గొన్నారు.



వీర జవాన్‌కు కొవ్వొత్తుల నివాళి

బోయినపల్లి: జమ్మూ కశ్మీర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన జవాన్ పబ్బాల అనీల్ మృతికి సంతాపంగా ఆయన స్వగ్రామం మల్కాపూర్‌లో మంగళవారం రాత్రి గ్రామస్తులు, యువకులు భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మహిళలు, యువకులు, ప్రజలు ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తా వరకు చేరుకుని నివాళి అర్పించారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వేడుకలు



ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీసాయిబాబా మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే వేడుకల్లో మొదటి రోజు సాయిబాబా ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఉదయం గణపతిహోమం, కలశస్థాపన, అంకురార్పన నిర్వహించారు. గురువారం నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఎల్లమ్మ సిద్దోగం

బోయినపల్లి: మండలంలోని గుండన్నపల్లి గ్రామంలో మంగళవారం గ్రామస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఎల్లమ్మ సిద్దోగం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఎల్లమ్మ బోనాలు తీశారు. డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో ఎల్లమ్మ ఆలయానికి తరలివెళ్లి నైవేద్యాలు సమర్పించారు. ఎల్లమ్మ సిద్దోగం గడను ఊరేగించారు.

రత్నంపేటలో వర్షం

బోయినపల్లి: మండలంలోని రత్నంపేట, జగ్గరావుపల్లి గ్రామ పరిసరాల్లో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. పలు చోట్ల విద్యుత్ వైర్లపై చెట్లు పడడంతో వైర్లు తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. జగ్గారావుపల్లి రహదారి పరిసరాల్లో చెట్లు విరిగిపోయాయి. సెస్ సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరించే పనులు చేయడంతో సాయంత్రం విద్యుత్ సరఫరా మెరుగైంది.

చెన్నమనేని రాజేశ్వర్‌రావుకు నివాళి

వేములవాడ: సీనియర్ శాసనసభ సభ్యుడిగా, ప్రతిపక్షనేతగా, ఎత్తిపోతల పథకం రూపకర్తగా పేరుగాంచిన స్వర్గీయ సీహెచ్ రాజేశ్వర్‌రావు వర్ధంతి సందర్భంగా వేములవాడ పట్టణంలోని తెలంగాణచౌక్‌లో ఆయన భారీ చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, సెస్ డైరెక్టర్ నామాల ఉమా, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు మంగళవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఈ ప్రాంతానికి చేసిన సేవలను కొనియాడారు.

వేములవాడరూరల్: వేములవాడలోని మల్లారంలో రోడ్‌లో చెన్నమనేని రాజేశ్వర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గొస్కుల రవి, జెడ్పీటీసీ ఏశ వాణి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, మాజీ ఏఎంసీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, ఏఎంసీ వైస్ చైర్మన్ వెలుమ బాల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఇంటర్ ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు

సిరిసిల్లటౌన్: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో సిరిసిల్ల ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా రాణించి ర్యాంకులు సాధించారు.

'సహస్ర' విద్యార్థుల ప్రభంజనం

జిల్లా కేంద్రంలోని సహస్ర జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం చాటారు. ఎంపీసీ సెకండ్ ఇయర్‌లో బింగి అక్షయ(990), బైపీసీలో నల్ల అక్షయ(975), సీఈసీ(927), ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో గుండేటి పూజిత(464), కోడం అర్చన(463), ఎల్లె భావన(462), ఆడెపు అమృత(461), ఎంబేరి సాయికృప(461), సీఈసీలో గోనె వైష్ణవి(486), వెల్దండి నవ్య(470), గుండెల్లి రక్షిత(465) మార్కులు సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిద్దిరాల శ్రీనివాస్, డైరెక్టర్లు నరేశ్‌కుమార్, పి.పవన్‌కుమార్, ఎస్. కుమారస్వామి అభినందించారు.

'సాయిశ్రీ' విద్యార్థుల హవా..

సిరిసిల్ల సాయిశ్రీ కళాశాల విద్యార్థులు హవా చాటారు. సెకండ్ ఇయర్ ఎంపీసీలో బి.లహరి(986), బి. సాత్విక(981), జి.అక్షయ(980), సీహెచ్ శ్రీవల్లి(977), ఎస్.మధుమిత(972), శిరీష(972), ఆర్.నిహారిక(972), కే.సంజయ్(970), బైపీసీలో ఎస్.అక్షయప్రసన్న(976), ఎన్. రక్షిత(975), వి. మనీష(971), సీఈసీలో ఏ.మహాలక్ష్మి(974), అన్స సురూర్(955) మార్కులు సాధించగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కరెస్పాండెంట్ తిరుపతి అభినందించారు.

ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోవాలి

- కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ ఉమ



కూలీలతో మాట్లాడుతున్న తుల ఉమ

కోనరావుపేట: గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేదల కోసం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ కోరారు. మండలంలోని మరిమడ్లలో మంగళవారం ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం గ్రామాల్లోని నిరుపేదలకు వరం లాంటిదన్నారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం నాగారం గ్రామంలో బలగం సినిమా నటుడు, కళాకారుడు కీసరి నర్సింగంను సన్మానించారు. ఎంపీటీసీ కోనేటి రేణుక, బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, నాయకులు గొట్టె రామచంద్రం, ఎగ్గె మల్లేశం, రమేశ్, భాస్కర్ పాల్గొన్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు ఉన్నందున బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈ దివ్య తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

నియామకం

బీసీ సంక్షేమ సంఘం మండల గౌరవ అధ్యక్షుడిగా పెద్దన్న

తంగళ్లపల్లి: మండలంలోని గండిలచ్చపేట గ్రామానికి చెందిన పాడిగె బామ్మగారి పెద్దన్నను బీసీ సంక్షేమ సంఘం మండల గౌరవ అధ్యక్షుడిగా నియమించినట్లు బీసీ యువజన సంఘం జాతీయ కార్యదర్శి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఇన్‌చార్జి ఈడుగురాల సురేశ్‌గౌడ్ తెలిపారు. మంగళవారం పెద్దన్నకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాకాల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి షేక్ అస్లాం, మండల అధ్యక్షుడు బామగారి వెంకన్న పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత క్లాసులు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆ గ్రామ ఎంప్లాయిస్ అసోసియేషన్ సహకారంతో విద్యార్థులకు ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులను మంగళవారం రిటైర్డ్ ప్రొఫెసర్ శివారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కదిరె రజిత, ఉపసర్పంచ్ హన్మంతు, ఎస్ఎంసీ చైర్మన్ సతీశ్, కార్యదర్శి శ్రీనివాస్, హెచ్ఎం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కరాటే కోచింగ్

వేములవాడ: వేసవి సెలవులు కొనసాగుతుండటంతో విద్యార్థులకు వేములవాడలో కరాటే మాస్టర్ ఎంఏ మన్నాన్ ఉచితంగా కరాటే శిక్షణ ఇస్తున్నారు. ఉదయం బాలురకు, సాయంత్రం బాలికలకు మండల పరిషత్ ఆవరణలో ఫ్రీగా కోచింగ్ ఇస్తున్నారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కార్మిక కుటుంబాన్ని ఆదుకోవాలి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సిరిసిల్లటౌన్: రెండ్రోజుల క్రితం విధుల్లో ఉండగా మృతిచెందిన భవన నిర్మాణ కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. బాధిత కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించి మాట్లాడారు. భవన నిర్మాణ బోర్డు నుంచి రూ.10 లక్షలు ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. రోడ్డున పడిన కుటుంబాన్ని ఆదుకునేలా డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించాలని కోరారు. నాయకులు పెంట శ్రీనివాస్, కే. దేవయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామంలో మంగళవారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సర్పంచ్ గణప శివజ్యోతి పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పోతరాజు లచ్చవ్వకు రూ.10 వేలు, ఏనుగుల అఖిలకు రూ.24 వేల విలువైన చెక్కులు అందజేశారు. నాయకులు నక్క రవి, బుస్స లింగం, రాగిపెల్లి కృష్ణారెడ్డి, ఫయాజ్, గడ్డపురం రాము, గణప మహేశ్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్, సేవాలాల్ తండా, మొర్రాపూర్, చీకోడు, నామాపూర్ గ్రామాల్లో కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ జనగామ శరత్‌రావు మంగళవారం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, సర్పంచులు గౌతంరావు, శ్రీనివాస్, దేవేందర్, రజిత, విజయ, నాయకులు పాల్గొన్నారు.